# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 14-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్మ విజయవాడలో శ్రీ కనకదుర్గమ్మవారిని కొద్దిసేపటి క్రితం దర్శించుకున్నారు.

- జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (ఎన్ఎస్ఏపీ) కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

- భారత్, ఆసియాన్ దేశాలు శాంతియుత, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని నిర్మించడంలో ఉమ్మడి ఆసక్తిని కలిగి ఉన్నాయని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తెలిపారు.

- హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య నాల్గవ టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రపతి ద్రౌపది ముర్మ విజయవాడలోని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో కనకదుర్గమ్మవారిని కొద్దిసేపటి క్రితం దర్శించుకున్నారు. అంతరాలయంలో పూజల అనంతరం అర్చకులు రాష్ట్రపతికి వేదాశీర్వచనం ఇచ్చారు. ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి హోంమంత్రి అనిత, స్థానిక ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ స్వాగతం పలికారు. అంతకుముందు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి రాష్ట్రపతి చేరుకున్నారు. గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, పెమ్మసాని చంద్రశేఖర్ పలువురు రాష్ట్ర మంత్రులు రాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో రాష్ట్రపతి ఆలయానికి చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా రేపు నగరంలో జాతీయ సరస్ మేళా - 2026ను రాష్ట్రపతి ప్రారంభించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం (నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రామ్ - NSAP) కొనసాగింపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 ఆర్థిక సంవత్సరం వరకు ఐదేళ్లపాటు ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఇందుకోసం 53 వేల 428 కోట్ల రూపాయలు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. న్యూఢిల్లీలో మంత్రివర్గ సమావేశం అనంతరం కేంద్ర సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వివరాలను వెల్లడించారు. దివ్యాంగుల పింఛను పథకం కింద 79 సంవత్సరాల వయస్సు వరకు నెలకు 375 రూపాయలు, 80 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారికి నెలకు 625 రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్…20 సెకన్లు)

అలాగే.. ఐడీబీఐ బ్యాంక్ వ్యూహాత్మక పునర్వ్యవస్థీకరణకు సైతం కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), నూతన పరిశ్రమల అభివృద్ధిలో ఐడీబీఐ బ్యాంక్ కీలక పాత్ర పోషిస్తోందని అశ్విని వైష్ణవ్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా 11 లక్షల 40 వేల మందికి పైగా రైల్వే ఉద్యోగులకు 78 రోజుల వేతనానికి సమానమైన ప్రొడక్టివిటీ లింక్డ్ బోనస్ (పీఎల్‌బీ) చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అశ్విని వైష్ణవ్ చెప్పారు. ఇందుకోసం 2 వేల 9 కోట్ల రూపాయలకు పైగా నిధులు కేటాయించిందని వెల్లడించారు. రైల్వే ఉద్యోగుల అత్యుత్తమ పనితీరును గుర్తిస్తూ ఈ బోనస్ చెల్లించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేల్లో భారీ స్థాయిలో నియామక ప్రక్రియ కొనసాగుతోందని సుమారు లక్షా 65 వేల పోస్టుల భర్తీకి నియామకాలు చేపడుతున్నట్లు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్, కెనడా దేశాల ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు చేకూర్చేలా భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. న్యూఢిల్లీలో కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌తో సమావేశమైనట్లు ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ వేదికగా వెల్లడించారు. ఈ సమావేశంలో భారత్-కెనడా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా వాణిజ్యం, సాంకేతిక పరిజ్ఞానం, భద్రత, ఇంధనం, విద్య, ఇరు దేశాల ప్రజల మధ్య పరస్పర సంబంధాల విస్తరణ వంటి రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై చర్చించినట్లు ప్రధాని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఆసియాన్ దేశాలు శాంతియుత, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని నిర్మించడంలో ఉమ్మడి ఆసక్తిని కలిగి ఉన్నాయని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఆసియాన్-భారత్ రక్షణ రంగ థింక్ ట్యాంక్ ఫోరమ్‌లో ఆయన ప్రసంగించారు. భారత్ ఇండో-పసిఫిక్ దార్శనికతలో ఆసియాన్ కీలక స్థానాన్ని కలిగి ఉందని చెప్పారు. ఆగ్నేయాసియా దేశాలతో సమాన భాగస్వామిగా కలిసి పనిచేయడం భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో దీర్ఘకాలిక నిబద్ధత అని స్పష్టం చేశారు. ఈ ఫోరమ్ ద్వారా ఆచరణాత్మక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాజ్ నాథ్ సింగ్ పలు ప్రతిపాదనలు చేశారు. సముద్ర భద్రత, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, సైబర్ ముప్పులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలపై దృష్టి సారిస్తూ భారత్-ఆసియాన్ సంయుక్త పరిశోధనా ప్రణాళికను రూపొందించాలని సూచించారు.

(వాయిస్…27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా దేశమైన సౌదీ అరేబియాలో వరుసగా జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. సౌదీ అరేబియా ప్రభుత్వానికి, ఆ దేశ ప్రజలకు సంఘీభావం ప్రకటించింది. న్యూఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ విషయంపై మాట్లాడుతూ.. నిన్న సౌదీ అరేబియాలోని ఆరామ్ కో ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని భారత్ ఖండిస్తోందని తెలిపారు. ఆ దేశంలోని పౌర మౌలిక సదుపాయాలపై జరిగే ఇటువంటి దాడులను ఏమాత్రం ఆమోదించలేమని, వీటిని తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేశారు. సౌదీ అరేబియా సార్వభౌమత్వాన్ని పరిరక్షించే విషయంలో ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా ఉంటుందని రణధీర్ జైస్వాల్ పేర్కొంటూ…

(వాయిస్…24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

అంతర్జాతీయంగా అంగీకరించిన నియమాల అమలులో మధ్యస్థ శక్తుల మధ్య ఏకాభిప్రాయం, పరస్పర అవగాహన కీలక పాత్ర పోషిస్తాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన బ్లూమ్ బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ఆయన మాట్లాడుతూ, బెదిరింపుల ద్వారా ఇతర దేశాలపై తమ నిబంధనలను బలవంతంగా ప్రయోగించే కాలం ముగిసిందని పేర్కొన్నారు. ప్రపంచం నూతన అంతర్జాతీయ వ్యవస్థ వైపు పయనిస్తోందని, అంతర్జాతీయ వ్యవహారాల్లో మరిన్ని దేశాలు విస్తృత పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత పరివర్తనను

క్రమబద్ధమైన వ్యవస్థ నుంచి గందరగోళ పరిస్థితులకు మార్పుగా చూడకూడదని, ఇది భిన్నమైన అంతర్జాతీయ వ్యవస్థ ఆవిర్భావ ప్రక్రియగా పరిగణించాలని జైశంకర్ అభిప్రాయం వ్యక్తం చేస్తూ...

(వాయిస్…29 సెకన్లు)

ఇదే కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ ప్రపంచ సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థలో వ్యయంతో పాటు విశ్వసనీయత, సైబర్ భద్రతకు ప్రాధాన్యం పెరుగుతోందని చెప్పారు. సెమీకండక్టర్ల రూపకల్పన, తయారీ, తుది ఉత్పత్తుల పరీక్షల రంగాల్లో భారత్‌ను విశ్వసనీయ భాగస్వామిగా నిలబెట్టడమే లక్ష్యమని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఐదు మ్యాచ్ ల టి-20 సిరీస్ లో భాగంగా హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య 4వ టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. ముందుగా టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్ 15 ఓవర్లు పూర్తయ్యేసరికి 3 వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. కాగా ఈ సిరీస్ లో భారత్ రెండు మ్యాచ్ లలో విజయం సాధించి ముందంజలో ఉంది.

= = = = = = = = = = = = = = = = = = =

చెరకు రైతులు లేవనెత్తిన సమస్యలను పరిశీలించి, వారి ఆందోళనలకు తగిన పరిష్కారాలను సూచించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటు చేసింది. నీతి ఆయోగ్ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ రమేశ్ చంద్ ఈ కమిటీకి అధ్యక్షత వహిస్తారు. కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన చెరకు రైతుల ప్రతినిధులు.. కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్, ప్రహ్లాద్ జోషిలతో సమావేశమైన సందర్భంగా తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, పశ్చిమ రాజస్థాన్ ప్రాంతాల్లో శుక్రవారం వరకు ఉరుములు, మెరుపులతో పాటు వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, రాజస్థాన్, విదర్భ, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, దక్షిణ అంతర్గత కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకాల్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాతావరణ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = =